ప్రజాశక్తి

బుధవారం 20 మార్చి 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

భద్రతా వైఫల్యాలపై ఆరా!

- ప్రజాగళం సభలో నిబంధనల మేరకు వ్యవహరించలేదని విమర్శలు
- అనధికారికంగా పాస్‌ల జారీకి అనుమతివ్వడం వల్లే ముప్పు?

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్ద ఇటీవల జరిగిన ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యాలపై ఉన్నతాధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఈ వ్యవహారంలో పోలీసు ఉన్నతాధికారులు నిబంధనల మేరకు వ్యవహారించకుండా పాస్ జారీ ప్రక్రియను మూడు పార్టీలకు కలిపి అప్పగించడం వల్లే అనేక సమస్యలు వచ్చాయనే వాదన అధికారుల నుంచి విన్పిస్తోంది. ఎన్నికల కోడ్ ఉన్నా ప్రధాన మంత్రి పాల్గొనే సభలో భద్రతా, ప్రొటోకాల్ మొత్తం జిల్లా అధికారుల పర్యవేక్షణలోనే జరగాలని సభకు రెండు రోజులముందే ఎస్‌పిజి అధికారులు పల్నాడు జిల్లా ఉన్నతాధికారులకు సూచించినట్టు తెలిసింది. సభా వేదికకు ముందు భాగంగా కొంత ఖాళీ స్థలం (డిజోన్) విడిచి పెడతారు. ఆ తరువాత గ్యాలరీల్లో అధికారికంగా జారీ చేసిన పాస్ హోల్డర్లు కూర్చునేలా మూడు గ్యాలరీలు ఏర్పాటు చేస్తారు. వివిఐపిల పర్యటనల్లో ప్రజా ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు ఒక గ్యాలరీ, ఉన్నతాధికారులు, జిల్లా యంత్రాంగం ఒక గ్యాలరీ, మీడియాకు ఒక గ్యాలరీని ఏర్పాటు చేస్తారు. ఈ మూడు గ్యాలరీల్లో ఉండే వారికి జిల్లా ఉన్నతాధికారులు పాస్ జారీ చేస్తారు. అయితే ప్రజాగళం సభలో ప్రధాని పాల్గొంటున్నా ఉన్నతాధికారులు అధికారికంగా పాస్‌లు జారీచేయలేదు. దీంతో టిడిపి, జనసేన, బిజెపి సంయుక్తంగా పాస్‌లుజారీ చేశాయి. వీటిపై పార్టీ గుర్తులు తప్ప ఎటువంటి అధికారిక ముద్ర, సంతకం లేవు. మూడు పార్టీలకు చెందిన వారి కోసం వివిఐపి, విఐపి, మీడియా పేరుతో పాస్‌లు ఆయా పార్టీలు తమ అనుచరులకు, మీడియాకు ఇష్టానుసారంగా పంపిణీ చేశాయి. దీంతో సాధారణ కార్యకర్తలు సైతం ప్రధాని సభా వేదికకు అతి దగ్గరలో డి.జోన్‌కు సమీపంలో కూర్చున్నారు. అంతేగాక ఈ గ్యాలరీల్లోకి పరిమితి లేకుండా ఎక్కువ మందిని అనుమతించడం వల్ల తీవ్ర తొక్కిసలాట జరిగింది. గ్యాలరీల్లో కూర్చునే అవకాశం లేక కొంత



యువకులు మైకులు, విద్యుత్ వైర్లు కట్టిన స్తంభాలు ఎక్కి కూర్చున్నారు. కొంతమంది తమ ముందున్న కార్యకర్తలను పిలిచేందుకు వాటర్ బాటిల్స్‌ను విసరడం కనిపించింది. అయితే వాటర్ బాటిల్స్‌ను అనుమతించవద్దని ఎస్‌పిజి, ఇతర విభాగం అధికారులు జిల్లా అధికారులకు, సభా నిర్వాహకులకు సూచించినా వారు పట్టించుకోలేదు. వాటర్ బాటిల్స్ విసరడం వల్ల వేదికపైన ఉన్న ప్రధాన మంత్రిపైకి విసురుతున్నారనే భావనతో ఎస్‌పిజి అధికారులు ఆందోళనకు గురయ్యారు.

సభలో పలు గ్యాలరీల్లోకి కార్యకర్తలు, సాధారణ ప్రజలు చొచ్చుకొని వస్తున్నా నియంత్రించడంలో పోలీసు అధికారులు పట్టిపట్టన్నట్టు వ్యవహరించారు. దీంతో చాలామంది ఊపిరి ఆడక ఇబ్బందిపడ్డారు.

▸ 2లో

మోసం చేసిన నాయకులను నిలదీయండి

- వరికపూడిసెల నిర్మాణానికి బాండ్లపై సంతకం అడగండి
- ప్రాజెక్టు పూర్తి అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టాలి : జలసాధన సమితి

ప్రజాశక్తి - వినుకొండ



వరికపూడిసెల ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించకుండా పల్నాడు ప్రాంత ప్రజలకు చేసిన మోసాన్ని ప్రతి ఒక్కరూ నిలదీయాలని జలసాధన సమితి సభ్యులు కోరారు. బొల్లాపల్లి మండలం అయ్యన్నపాలెంలో వరికపూడిసెల జల సాధన సమితి కమిటీ సమావేశం మంగళశారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అటవీ శాఖ అనుమతి విషయంలో అన్ని అడ్డంకులు తొలగి పూర్తి అనుమతులు పొందేందుకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.14.70 కోట్లు కూడా చెల్లించకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. ఎన్నికల ముందు వినుకొండలో జరిగిన బహిరంగ సభలో తాము అధికారంలోకి రాగానే వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మిస్తామని, ప్రాజెక్టు నిర్మించలేకపోతే పల్నాడు ప్రజలకు మొహం కూడా చూపబోమంటూ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చెప్పలేదా? అని నిలదీశారు. వైసిపి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి ఐదేళ్లలో ఒక రూపాయి కూడా నిధులు కేటాయించకుండా, సిఎం జగన్మోహన్‌రెడ్డి ఉత్తుత్తి శంకుస్థాపన ద్వారా పల్నాడు ప్రజలను మరోసారి మోసం చేశారని మండిపడ్డారు. చివరి బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించాలని జలసాధన సమితి, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు కోరినా ప్రభుత్వం పెడచెవిన పెట్టడం దుర్మార్గమన్నారు. ఎన్నికలు వస్తున్న తరుణంలో తూతూ మంత్రంగా వెల్దుర్తి మండలం హనుమాపురం తండా వద్ద ప్రైవేటు భూముల్లో పైప్‌లైన్ నిర్మాణం అంటూ పనులు ప్రారంభించడం, మరుసటి రోజు నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్, మాచర్ల, వినుకొండ ఎమ్మెల్యేలు ఆ పనులు సందర్శన అంటూ వెళ్లి షో చేయటం మరో వంచనని

▸ 2లో



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

మైక్ పని చేయకపోయినా పోలీసులపైనే నెపమా?

రాజకీయాల్లో అనైతికతకు మారుపేరు చంద్రబాబు

ముస్లిమ్ రిజర్వేషన్ బిల్లును రద్దు చేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటించారు : మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లిటౌన్

రాజకీయాల్లో అనైతికతకు మారుపేరు టిడిపి అధినేత చంద్రబాబు అని నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. బొప్పూడిలో నిర్వహించిన ప్రజాగళం సభ నిర్వహణ వైఫల్యాలను ప్రభుత్వంపై నెట్టే యత్నం బాబు డొల్లాతనానికి నిదర్శనమని మండిపడ్డారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నడవలేక దారి వంకరగా అన్నట్లుగా చంద్రబాబు మాటలున్నాయని, సభ అట్టర్‌ప్లాప్ కావడాన్ని జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రజాగళంలో మైక్ పని చేయకపోతే దాన్ని కూడా పోలీస్ వైఫల్యం అంటూ బాబు అనటం విడ్డురంగా ఉందన్నారు. గతంలో ముగ్గురు కలసి పనిచేసి మళ్లీ ముగ్గురు కలసి తిట్టుకున్న సంగతి ప్రజలు మరచిపోలేదని చెప్పారు. తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సందర్భంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా.. తాము అధికారంలోకి వస్తే ముస్లిమ్ రిజర్వేషన్ బిల్లును రద్దు చేస్తామంటూ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. బాబు కూటమి ఏపీలో అధికారంలోకి వస్తే ఈ ప్రమాదం ఉందనే విషయాన్ని ముస్లిములు గుర్తించాలని కోరారు.

క్షమాపణ చెప్పకుంటే ఇండిపెండెంట్‌గా పోటీ

జనసేన సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెంకట అప్పారావు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



మాట్లాడుతున్న బొర్రా వెంకట అప్పారావు

జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంటేశ్వరావు తనకు భేషరతుగా ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పకుంటే సత్తెనపల్లి అసెంబ్లీ స్థానం నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొర్రా వెంకట అప్పారావు అన్నారు. మండలంలోని ధూళిపాళ్లలో జనసేన నియోజవకర్గ విస్తృత సమావేశం సోమవారం రాత్రి నిర్వహించగా వెంకట అప్పారావు మాట్లాడుతూ తాను వైసిపి కోవర్టునంటూ వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారని, ఏ ఆధారంతో అలా అన్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీని వెంకటేశ్వరరావు నాశనం చేస్తున్నారని, ఆయన వచ్చాక జిల్లాలో గ్రూపులు ఏర్పడ్డాయని విమర్శించారు. టిడిపి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణకు తనకు మధ్య ఆగాధం సృష్టిస్తున్నారని అన్నారు. మిత్రపక్షాలు తగిన గౌరవం దక్కడం లేదని జనసేన నాయకులను

▸ 2లో

ఎలక్షన్ సెల్‌ను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు



సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎలక్షన్ కో-ఆర్డినేషన్ సెక్షన్, లీగల్ సెల్, మీడియా సర్టిఫికెట్ అండ్ మానిటరింగ్ కమిటీ విభాగాన్ని, డీఆర్సి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌లను గుంటూరు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారికి తగు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారికి ప్రతిరోజూ సమర్పించాల్సిన నివేదికలను నిర్ణీత సమయంలోపు పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పి.రోజా, కమిటీల నోడల్ అధికారులు పాల్గొన్నారు.



మల్లు స్వరాజ్యం మాటే స్ఫూర్తి

వర్ధంతి సభలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం మాటే స్ఫూర్తిదాయకమని, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. కొలనుకొండలోని జాతీయ రహదారి వద్ద ఉన్న ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. స్వరాజ్యం చిత్రపటానికి రమాదేవి, ఇతర నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం 14 ఏళ్ల వయసులోనే భూమికోసం, భుక్తి కోసం జరిగిన పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. తుదిశ్వాస వరకూ కమ్యూనిస్టుగా ఉన్నారని, ప్రజా సమస్యల అలుపెరగని పోరాటం చేశారని చెప్పారు. మహిళలు కర్రలు చేత పట్టుకుంటేనే మహిళా సమస్యలు పారదోలగలమని స్వరాజ్యం అంటూ ఉండేవారని గుర్తు చేశారు. భారతమాత, కనకదుర్గ, శక్తి స్వరూపిణి అంటారు గానీ బిల్కిస్‌బానో, మణిపూర్ మహిళలు శక్తులు కాదా అని ఆమె ప్రశ్నించారు. స్వరాజ్యం చనిపోయేంతవరకు ఆమెను చూడడానికి వెళ్లిన వారందరికీ సెల్యూట్ చెప్పి, స్ఫూర్తిదాయకంగా నిలిచారని ఐద్వా నాయకులు సుధా అన్నారు. నిరంతరం మహిళా సమస్యల పైన స్వరాజ్యం మాట్లాడేవారని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు డి.శ్రీనివాస్‌కుమారి, పి.గిరిజ, పార్వతి, రమణమ్మ పాల్గొన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం) : 6.24

సహారీ (గురువారం ఉదయం) : 4.55

ఇహెచ్ఎస్‌ను పటిష్టంగా అమలు చేయండి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ పథకం (ఇహెచ్ఎస్)ను పటిష్టం ఆమలు చేయాలని సూపరింటెండెంట్ వై.కిరణ్‌కుమార్ తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ నాగేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్, ఇహెచ్ఎస్ సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ పథకం లో భాగంగా ఉద్యోగులు సేవలు పొందలేకపోతున్నారని, ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగులు కూడా సేవలు పొందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఆసుపత్రిలో ఉద్యోగులు చేరుతున్నట్లు కూడా సిబ్బందికి తెలియకపోవడం విచారకరమని అన్నారు. ఇలాంటి సమాచారాన్ని ఇహెచ్ఎస్ సిబ్బంది, వివిధ విభాగాధిపతులు, నర్సింగ్ సిబ్బంది, హార్వే సంస్థ సేకరించి ఉద్యోగులందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులకు ఆరోగ్యశ్రీ వర్తించే విధంగా అమలు చేస్తున్నారో అదేవిధంగా ఇఎచ్ఎస్‌ను కూడా పకడ్బందీగా ఉద్యోగులకు వర్తించే విధంగా చేయాలనీ చెప్పారు. హార్వే సంస్థ ఈ విషయం లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్ల నోటీసులు ఇవ్వాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో చేరే ప్రతి ఉద్యోగి సమాచారం వెంటనే ఇహెచ్ఎస్ సిబ్బందికి తెలపాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు అవసరమైన వైద్య సేవలు అందించడానికి ఆసుపత్రిలోని నాట్కోలో ప్రత్యేక గదులను కేటాయించాలని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి నాట్కోలో ఒక ప్రభుత్వ ఉద్యోగి భార్య చేరిన విషయాన్నీ ఇహెచ్ఎస్ సిబ్బంది వద్ద సమాచారం లేకుండా పోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



'బాబు కుయుక్తులను ప్రజలు నమ్మరు'

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టేందుకు టిడిపి అధినేత చంద్రబాబు పన్నే కుయుక్తులను ప్రజలు గమనిస్తున్నారని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. గుంటూరులో మంగళవారం 34వ డివిజన్‌లో జరిగిన వైసిపి కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబునాయుడు పన్నే కుట్రలు, చేసే విష ప్రచారాలు, ఇచ్చే దొంగ హామీలు.. ఇలా అన్నీ ప్రజలకు తెలుసని, చంద్రబాబును ఈ రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ నమ్మరని అన్నారు. ఎన్నికల సమయంలో దొంగ హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజలను ఎలా మోసం చేయాలో చంద్రబాబుకు తెలిసినంతగా ఎవరికీ తెలియదని ఎద్దేవ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గోపి శ్రీనివాస్, అందుగుల సంతోష్, స్మితా పద్మజ పాల్గొన్నారు.



కాంగ్రెస్ నుండి వైసిపిలోకి చేరిక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎం.జగన్‌మోహన్‌రెడ్డి, రావూరు లక్ష్మీనారాయణ శాస్త్రి మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సిఎం వైఎస్ జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. పిసిసి జనరల్ సెక్రటరీ మద్దిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, పిసిసి కార్యదర్శి లక్ష్మీనారాయణ శాస్త్రి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. వారివెంట ఎమ్మెల్యే ముస్తాఫా, వైసిపి గుంటూరు తూర్పు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి నూరి ఫాతిమా ఉన్నారు.

హక్కుల కోసం పోరాడే

సిపిఎం, కమ్యూనిస్టులను గెలిపించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు



ఆటో కార్మికుల నుద్దేశించి మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ : కార్మిక నేతలను, కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపాలని, అసెంబ్లీలో కార్మిక, ప్రజావాణి వినిపించేందుకు కార్మిక నేతలను, కమ్యూనిస్టులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు పిలుపునిచ్చారు. విజయవాడ బాలోత్సవ భవన్, రైల్వే స్టేషన్ వద్ద వేర్వేరుగా ఆటో కార్మికులతో మంగళవారం సభలు, సమావేశాలు నిర్వహించారు. విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాబూరావు మాట్లాడుతూ... సామాన్యులకు, కార్మికులకు అండగా నిలిచే సిపిఎం పోటీ చేస్తున్న విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఆటో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులందరూ ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సిపిఎం, కమ్యూనిస్టుల విజయం కార్మిక విజయం, సామాన్యుల విజయం అని అన్నారు. భూకబ్జాలు, దోపిడీ చేసి సంపాదించిన కోట్లాది రూపాయలతో ఓట్లు కొనుగోలు చేసి వైసిపి, టిడిపిలు గెలవాలని చూస్తున్నాయని, ధన రాజకీయాలను నిశ్శబ్ద విప్లవంతో ఎదుర్కొందామని పేర్కొన్నారు. విజయవాడ నగరంలోని ఆటో కార్మికులపై పోలీసు, రవాణా శాఖల పెనాల్టీలు ఆపాలని కోరారు. మోడీ ప్రభుత్వం గత పదేళ్లలో రవాణా రంగాన్ని దెబ్బతీసిందని దుయ్యబట్టారు. సిఎన్జి, పెట్రోల్, డీజిల్ రేట్లు, ఇన్సూరెన్స్ ఛార్జీలు పెంచి ఆటో కార్మికులపై మోయలేని భారాలను మోపిందని విమర్శించారు. చట్టాల్లో మార్పులు తెచ్చి ఆటో, రవాణా కార్మికులు నేరస్తుల్లా చిత్రీకరించి, భారీగా పెనాల్టీలు వేస్తున్నారు, అక్రమంగా శిక్షిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో కార్మికులను మభ్యపరిచి, కార్మికులకు ఇచ్చింది తక్కువ, వివిధరూపాల్లో కార్మికులపై భారాలు మోపింది ఎక్కువ అని అన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ... ఆటో కార్మికుల హక్కుల కోసం పోరాడే సిపిఎం సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తుందని, ఆటో కార్మికులు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఆటో కార్మికుల సమస్యలు పెరిగిపోయాయని అన్నారు. రైల్వే రంగం ప్రైవేటీకరణ ఆటో కార్మికులకు ప్రమాదంగా మారిందన్నారు. నగరంలో రోడ్లు, ఫ్లైఓవర్, అండర్ బ్రిడ్జిలు సరిగా లేక రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారాయని, ఆటో కార్మికులు బాధితులుగా మారారని అన్నారు. ఆటో, రవాణా కార్మికులను వంచించిన బిజెపి, వైసిపి ప్రభుత్వాలకు గద్దె దించండని కోరారు. ఈ సభలలో కార్మిక, సిఐటియు నేతలు కే.దుర్గారావు, రూబేన్, భాస్కరరావు, రాఘవ, పైడిరాజు, వెంకన్న, చిరంజీవి, గంగాధర్ వెంకటేశ్వరరావు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్తలో జర్నలిస్టుల ఇళ్లస్థలాల దరఖాస్తులపై విచారణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో జర్నలిస్టుల ఇళ్లస్థలాలకు సంబంధించిన ఫైల్‌ను చెత్త కుప్పలో వేసిన ఘటనపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు. కార్యాలయంలో భద్రంగా ఉండాల్సిన ఫైల్ చెత్త కుప్పలో ఉండటంపై కొల్లు రవీంద్ర మంగళవారం సమాచార శాఖ డీడీని కలిసి వివరణ కోరారు. ఈ విషయంపై డీడీ వివరణ ఇస్తూ పది రోజుల క్రితం కార్యాలయంఓల ఫైల్ మిస్ అయిన మాట వాస్తవమేనన్నారు. అనంతరం కొల్లు రవీంద్ర మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించి జిల్లా కమిటీ సంతకం చేసిన తీర్మాన కాపీని చించి చెత్తబుట్టలో వేశారని, ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. ఉత్తుత్తి హామీలతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మచిలీపట్నం తహశీల్దార్ దొంగ పట్టాలు ఇస్తుంటే సమాచార శాఖ డీడీ దొంగ ప్రెస్‌నోట్లు రిలీజ్ చేసి ప్రజల్ని మోసం చేస్తున్నారన్నారు.

పదో తరగతి పరీక్షలకు 97.31శాతం హాజరు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పదో తరగతి పరీక్షలకు రెండో రోజైన మంగళశారం 97.31 శాతం హాజరు నమోదైంది. 27,721 మందికిగాను, 26,978 మంది హాజరయ్యారు. 663 మంది గైర్హాజరయ్యారు. డిఇఒ పి.శైలజ నగరంలోని పుల్లయ్య హైస్కూల్, శ్రీచైతన్య, భాష్యం స్కూల్, పట్టాభిపురం మున్సిపల్ హైస్కూల్, సెయింట్ ఆన్స్, నవీన స్కూల్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ తదితర పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన అధికారి

ప్రజాశక్తి-దుగ్గిరాల

మండలంలోని పరీక్ష కేంద్రాలను పదో తరగతి పరీక్షల రాష్ట్ర పరిశీలకులు పి.పార్వతి మంగళవారం పరిశీలించారు. దుగ్గిరాల బాలుర, బాలికల హైస్కూల్, ఈమని, పెదపాలెం గ్రామాల్లోని జెడ్‌పి పాఠశాలలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును, వసతుల కల్పనపై తనిఖీ చేశారు. ఈ నాలుగు కేంద్రాల్లో 495 మంది విద్యార్థిని విద్యార్థులకు గాను మంగళవారం 464 మంది హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ప్రజల వాణి వినిపించేందుకు సిపిఎంను గెలిపించాలి: బాబూరావు




ప్రజాశక్తి - విజయవాడ : పేదల కాలువగట్ల ఇళ్లు ఉండాలన్నా...పట్టాలు మంజూరు కావాలన్నా సిపిఎం, కమ్యూనిస్టులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. గుణదలలోని మురళీనగర్ కట్టపై మంగళవారం సాయంత్రం సిపిఎం ఎన్నికల ప్రచారం జరిగింది. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ, ప్రజల వద్ద నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటూ సిపిఎం ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. .కాలువగట్లమీద ఉన్న ఇళ్లను తొలగించాలని ప్రస్తుత వైసిపి ప్రభుత్వం, గతంలో ఉన్న టిడిపి ప్రభుత్వాలు తీవ్ర ప్రయత్నాలు చేశాయని, సిపిఎం, కమ్యూనిస్టులు, స్థానిక ప్రజలు చేసిన పోరాటాల కారణంగా ఆగాయని అన్నారు. సిపిఎం నేతలను అరెస్టులు చేసి, కేసులు కూడా బనాయించడం జరిగిందన్నారు. వాటన్నింటికీ భయపడిపోకుండా నికరంగా పేదల కోసం ఉద్యమించామన్నారు. కాలువకట్ట వాసులకు పట్టాలు మంజూరు చేయాలని, అద్దెకుంటున్న వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. గత 15 ఏళ్ల నుంచి గుణదల ఫ్లైఓవర్ మొండిగోడలకే పరిమితం అయిందని అన్నారు. మూడు ప్రభుత్వాలు మారినా, ప్రజాప్రతినిధులు మారినా ఫ్లైఓవర్ నిర్మాణాన్ని వైసిపి, టిడిపి పూర్తి చేయలేకపోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోసం చేసిన నాయకులను నిలదీయండి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణం అంశపై వివిధ రాజకీయ పార్టీలు ఇప్పటికీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టలేదని,, ఇప్పటికైనా చేర్చి ప్రజలకు స్పష్టమైన హామీనిచ్చి ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని బాండ్ పేపర్ మీద ఆ నేతలు సంతకాలు చేస్తేనే ప్రజలు ఓటు వేస్తామని, లేకుంటే వరికపూడిసెల జలసాధన సమితి చర్చించుకుని ఎంపీ ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జల సాధన సమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డివి రమణా రావు, ప్రధాన కార్యదర్శి తంగిరాల అనంతరామిరెడ్డి, ఉపాధ్య క్షులుగా పల్నాడు శ్రీను, భూక్య రామాంజి నాయక్, గణేష్, కమిటీ సభ్యులుగా 16 మంది ఎన్నికయ్యారు.



జలసాధన సమితి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన టివి రమణరావును సత్కరిస్తున్న నాయకలు

భద్రతా వైఫల్యాలపై ఆరా!

(మొదటి పేజీ తరువాయి)

సభ జరిగి రోజు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల మధ్యాహ్నం మూడు గంటల వరకు గ్యాలరీలన్నీ ఖాళీగా ఉన్నాయి. ఎండ తీవ్రత తగ్గిన తరువాత నాలుగు గంటలకు ఒక్కసారి ప్రజలు గ్యాలరీల్లోకి రావడంతో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. పోలీసు ఉన్నతాధికారులు, దిగువ స్థాయి అధికారులు, వాలంటీర్ల నిర్వహణా లోపం వల్ల పలు గ్యాలరీల్లోకి సాధారణ ప్రజలు చొచ్చుకుని రావడం కన్పించింది. నారా లోకేష్ కూర్చున్న గ్యాలరీలోకి కూడా యువకులు చొచ్చుకు రావడంతో ఆయన కూడా అక్కడ నుంచి సురక్షితంగా నిష్క్రమించారు.

ప్రధాని సభా వేదికకు ముందు సాధారణ ప్రజలు, అనధికారిక పాస్ హోల్డర్లును కూర్చోడానికి అనుమతించడం భద్రతా వైఫల్యానికి కారణంగా అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే మూడు పార్టీల రాష్ట్ర నాయకులు ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే అంశంపై బుధవారం మూడుపార్టీల ముఖ్య నాయకులు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. సభ జరుగుతున్న సమయంలో బాటిళ్లు గ్యాలరీల్లోకి విసరడం, లైట్ టవర్స్ ఎక్కేయడం, మైక్‌సెట్ పైకి జనం దూసుకురావడం, ప్రధాని ఉన్న సమయంలోనే జనం వేదికకు సమీపంలోకి రావడం వంటి అంశాలపై ఇప్పటికే కేంద్ర నిఘా అధికారులు జిల్లా అధికారులను వివరణ కోరినట్టు తెలిసింది. ప్రధాని సభకు తగిన ప్రొటోకాల్ ఏర్పాట్లు చేయకపోవడం, జనాన్ని నియంత్రించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోకపోవడం వంటి పరిణామాల్ని తీవ్ర భద్రతా లోపాలుగానే పరిగణిస్తున్నట్లు తెలిసింది.

క్షమాపణ చెప్పకుంటే ఇండిపెండెంట్‌గా పోటీ

(మొదటి పేజీ తరువాయి)

అవమాన పర్చడంతోపాటు కొందరికి టిడిపి కండువాలు కప్పుతున్నారని విమర్శించారు. జనసేన డెవలప్మెంట్ ఫోరమ్ అధ్యక్షులు ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడిపితో పొత్తు జనసేనను బలహీన పరుస్తుందన్నారు. జనసేనలో శిఘండులున్నారని, వారి వల్లే పార్టీ బలహీనమవుతోందని చెప్పారు. ఇదిలా ఉండగా వెంకట అప్పారావుకు జనసేన నాయకులు, కార్యకర్తలు మద్దతు ప్రకటించారు. ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని చెప్పారు. సమావేశంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సాంబశివరావు, కౌన్సిలర్ ఆర్.సుమన్, నాయకులు బి.కేశవ, మండల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం జరిగి ఐదు రోజులు

దెబ్బతిన్న ఆటో రోడ్డుపైనే!


తెనాలి-విజయవాడ రోడ్డులో ఆటోనగర్ వద్ద రోడ్డుపై ఉన్న ఆటో

ప్రజాశక్తి-తెనాలి

రోడ్డు ప్రమాదం జరిగి సరిగ్గా ఐదు రోజులు. కాని ఆ ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో తొలగించటానికి మాత్రం అధికారులకు తీరికలేదు. రోడ్డుపై నిలిచి ఉన్న ఆటో రాత్రి వేళల్లో మరిన్ని ప్రమాదాలకు దారితీస్తుందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 15న తెనాలి-విజయవాడ రోడ్డులో ఆటో ప్రమాదానికి గురైంది. కఠెవరం నుంచి ముస్నంగి వెళుతున్న ఆటో ప్రమాదవశాత్తూ ఆటోనగర్ వద్ద ఆర్టీసీ బస్సును ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్‌తో పాటు పది మంది గాయపడిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటోను ఇంకా రోడ్డుపైనే ఉంచారు. వాస్తవానికి ప్రమాదానికి గురైన వాహనాలపై కేసు నమోదు చేసి, వాటిని స్టేషన్‌కు తరలిస్తారు. అయితే అందుకు భిన్నంగా ఆటోను రోడ్డుపైనే వదిలేశారు. ఈ రోడ్డులో నిత్యం వాహనాల జోరు అధికం. దీనికి తోడు నాలుగు లైన్ల రోడ్డు కుడివైపున దెబ్బతినటంతో వాహనాలు ఒన్‌వే పాటించకుండా వాహనాలు కొన్ని రాకపోకలు ఒకే రోడ్డులో ప్రయాణిస్తుంటాయి. ఈ పరిణామాలతో రోడ్డుపైనే ఉన్న ఆటోతో రాత్రివేళల్లో మరికొన్ని ప్రమాదాలు జరగటానికి ఆస్కారం ఉందని, తక్షణమే ఆటోను అక్కడి నుంచి తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టిడిపి విస్తృతస్థాయి సమావేశం



ప్రజాశక్తి-పెదకూరపాడు

వైసిపి దుర్మార్గ పాలనకు చరమ గీతం పాడాలని పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులోని సాయి శ్రీనివాస కళ్యాణ మండపంలో మంగళవారం మండల టిడిపి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ప్రవీణ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. సమావేశంలో ఆర్తిమళ్ళ రమేష్, చినరాజు, బి.రామ్ గోపాల్ రావు, భాష్యం ఆంజనేయులు, వి.అప్పారావు, వి. కిషోర్, ఎం. హరిబాబు, సర్పంచ్ జి.రాజు పాల్గొన్నారు.

ప్రయాణికులను బెదిరిస్తున్న దుండగులు అరెస్టు


వివరాలు వెల్లడించిన రైల్వే సిఐ, ఎస్ఐ

ప్రజాశక్తి-తెనాలి

రైలులో ప్రయాణికులను బెదిరించి నగదు వసూలు చేసిన దుండగులను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్పీఎఫ్ సిఐ ఫతే అలీ బేగ్, ఎస్ఐ ఎల్. సరస్వతి మంగళవారం వెల్లడించిన వివరాలు ప్రకారం ఇటీవల టాటానగర్ ఎక్స్‌ప్రెస్ లో సాధారణ బోగీలో కొందరు వ్యక్తులు ప్రవేశించి పెద్దగా అరిచి ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేశారు. తమకు నగదు చెల్లించాల్సిందిగా డిమాండ్ చేసి కొందరి నుంచి వసూలు చేశారు. రైలు విజయవాడ కృష్ణా బ్యారేజ్ సమీపంలో రైలు నెమ్మదించటంతో దుండగులు అక్కడ దిగి పారిపోయినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తెనాలి రైల్వే పోలీసులు దర్యాప్తు చేశారు. 8 మంది నిందితులను ఈ కేసులో అరెస్టు చేసినట్లు వెల్లడించారు.



మిర్చి నిల్వలు


బ్యాగులు

మిర్చి దిగుమతి	:	1,19,996
మిర్చి ఎగుమతి	:	1,15,322
మిర్చి నిల్వ	:	88,720

మిర్చి ధరలు

రూపాయలలో

334	9,000 - 20,000
నెం.5	10,500 - 17,000
273	10,500 - 19,000
341	9,000 - 18,000
సూపర్ 10	11,500 - 13,000
నాన్ ఏసి	
తేజ	8,000 - 20,500
బడిగి	10,000 - 19,500
దేవనూరు డీలక్స్	10,000 - 18,000
తాలుకాయలు	5,000 - 12,500



మంత్రి అంబటి రాంబాబును సన్మానిస్తున్న పెన్షనర్లు

పెన్షనర్ల సంక్షేమానికి కృషి : మంత్రి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

పెన్షనర్ల సంక్షేమనికి అన్ని విధాలుగా కషిచేస్తాం అని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లిలో మంగళ వారం పెన్షనర్లు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు సంఘ అధ్యక్షులు కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగులకు ఎల్లప్పుడూ తాము అండగా ఉంటామని వారికి ఏ ఇబ్బంది వున్నా ఆదుకుంటామని చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాలకు తమ ప్రభుత్వం అండగా నిలిచింది అన్నారు. ఈ 48 రోజుల్లో ప్రజలకు, వ్యాపారస్తులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించామన్నారు. ముఖ్యంగా రౌడీయిజాన్ని అణిచివేశామని, తాను దాడులను, దౌర్జన్యాలను ఎన్నడూ ప్రోత్సహించలేదనే విషయాన్ని ప్రజలు గమనించాలని అన్నారు. పెద్దలుగా ఈ విషయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గత ఎన్నో ఏళ్లుగా పెన్షనర్లను వేధిస్తున్న భవనం సమస్యను తాను పరిష్కరించిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం విశ్రాంతి ఉద్యోగులు మాట్లాడారు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు . అనంతరం రాంబాబును ఘనంగా సత్క రించారు.

హోంగార్డు ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ముప్పాళ్ల



మండలంలోని బొల్ల వరం అడ్డరోడ్డు వద్ద మంగళ వారం హోంగార్డు సుభాని ఏర్పాటు చేసిన చలివేం ద్రాన్ని ముఖ్య అతిథులు సత్తైనపల్లి రూరల్ సిఐ రాంబాబు, ముప్పాళ్ల ఎస్ఐ హజరతయ్య ప్రారం భించారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ మాట్లాడుతూ హోంగార్డు సుభాని సేవలు అభినందనీయమన్నారు. ఈ సం దర్భంగా చలివేంద్ర ఏర్పాటు కర్త హోంగార్డు సుభాని మాట్లా డుతూ గత ఇరవై ఏళ్లుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా సేవా దృకృథంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్న సుభానికి మండల ప్రజలు అభినందనలు తెలిపారు.



పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - వినుకొండ

బొల్లాపల్లి మండలం గుట్లపల్లి పంచాయతి గంగు పల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తల్లులు గురించి పౌష్టికాహారం గురించి తల్లులకు అవ గాహన కల్పించారు. తల్లులు, బాలింతలు, గర్భిణులు అంగన్వాడి కేంద్రం అందించే పౌష్టికాహారం సరైన సమ యానికి తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని మాట్లాడారు. వేసవి కాలంలో ఎండల తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ పద్మజ అంగన్వాడి టీచర్ చిన్న సుందరమ్మ, బాలింతలు గర్భవతులు పిల్లలు ఆయాలు టీచర్లు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం, నంబూద్రిపాద్ జీవితాలు ఆదర్శనీయం

- వర్ధంతి సభలో సిపిఎం నాయకుల ఘన నివాళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వీరనారి మల్లు స్వరాజ్యం, కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం నాయకులు ఈఎంఎస్ నంబూద్రిపాద్ జీవిత చరిత్రలు కమ్యూనిస్టు ఉద్యమాలకు, భావి తరాలకు ఆదర్శనీయమని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వర రెడ్డి అన్నారు. నరసరావుపేటలోని కోటప్పకొండ రోడ్డులో ఉన్న సిపిఎం కార్యా లయంలో మంగళవారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, పీడిత ప్రజల కోసం వీరో చిత పోరాటం చేసిన మల్లు స్వరాజ్యం, నంబూద్రిపాద్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు డి.శివకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం 500 ఎకరాలు ఉన్న భూస్వామ్య కుటుంబంలో పుట్టి, అడవుల్లో గిరిజన గుడిసెల్లో పెరిగారని, భూమి కోసం భుక్తి కోసం ఆమె పోరాడారని అన్నారు. పద్నాలుగేళ్ల వయసులోనే ఒక చేతిలో ఎర్ర జెండా మరో చేతిలో తుపాకీ చేత పట్టి నైజాం దొరలకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవ యోధురాలని అన్నారు. తెలంగాణ సంస్థానంలో దొరల భూస్వా ముల ఆగడాలకు వ్యతిరేకంగా సోదరుడు భీమిరెడ్డి నర్సింహరెడ్డి వెంట అడవులకు వెళ్లారని, నైజాం దొరల దురాగతాలను కళ్ళారా చూసి మహిళల పట్ల వివక్ష, అత్యా చారాలు కొనసాగుతుంటే ఆ దుర్మార్గాలకు వ్యతిరేకంగా ఉద్యమించారని గుర్తు చేశారు. పోరాటకాలంలో పంచిన భూము ల రికార్డులు పేదల నుంచి గుంజుకున్న వాటిని తిరిగి పేదలకు ఇప్పించే వరకూ పోరాటం చేశారని, ఆమె ఆశయాల బాటలో నడవడమే ఆమెకు అర్పించే ఘన నివాళి అని అన్నారు. ప్రజల హక్కుల కోసం పేదరిక నిర్మూలన కోసం అకుంఠిత మైన దీక్షతో పోరాటం చేశారని గుర్తు చేశారు. పేదలను అణచివేస్తున్న భూస్వా ములను ఎదిరించి ఆంధ్ర మహా సభ కమ్యూనిస్టుల నాయకత్వంలో లక్షల ఎకరాల భూస్వాముల భూమి లేని పేద



మల్లు స్వరాజ్యం, నంబూద్రిపాద్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న లక్ష్మీశ్వర రెడ్డి

లకు పంపిణీ చేశారన్నారు.

సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ సనాతన సంప్రదాయ కుటుంబంలో పుట్టి, కమ్యూనిస్టు ఉద్యమాల పట్ల ఆకర్షితులైన వ్యక్తి నంబూద్రిపాద్ అని అన్నారు. కేర ళలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన మార్క్సిస్టు ప్రభుత్వానికి నాయకత్వం వహించిన నంబూద్రిపాద్ భారతదేశ మొట్టమొదటి కమ్యూనిస్టు ముఖ్య మం త్రిగా 1957లో చరిత్ర సృష్టించారన్నారు. దేశంలో సోషలిజం తీసుకు రావడానికి తన వంతు కృషి చేశారని, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకుని పరిష్కరించారని చెప్పారు. కేరళలో పెట్టుబడులు పెట్టేం దుకు ప్రైవేట్ ఔత్సాహిక పారి శ్రామిక వేత్తలను ఆహ్వానించిన విషయాన్ని గురు చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయ కులు షేక్ సిలార్ మసూద్, కె.కోటేశ్వర రావు, కె.ఆంజ నేయులు, మస్తాన్ వలి, హుస్సేన్, గుంటూరు మల్లీశ్వరి, ఫాతిమా, నాగమ్మ భాయ్ సిపిఎం అభిమాని జిలాని మాలిక్ పాల్గొన్నారు.

పొరపాటున హిందీ పరీక్ష రాసిన విద్యార్థిని

- విద్యార్థినికి న్యాయం చేసేందుకు ఉన్నతాధికారుల అంగీకారం
- ఆ విద్యార్థినికి 31న తెలుగు పరీక్ష
- వెల్లడించిన మండల విధ్యాశాఖాధికారులు



ప్రజాశక్తి- కారంపూడి

పదవ తరగతి పరీక్షలలో తెలుగు సబ్జెక్ట్‌కు బదులు హిందీ సబ్జెక్టు పరీక్ష రాసిన కారంపూడి కస్తూరిబా గాంధీ స్కూల్ విద్యార్థిని ప్రియాంకబాయికి న్యాయం చేసేం దుకు ఉన్నత అధికారులు అంగీకరించారని మండల విద్యశాఖ అధి కారులు రవికుమార్, కాంతారావు తెలిపారు. స్థానిక ఎం. ఈ. వో కార్యా లయంలో వారు మీడియాతో మాట్లా డుతూ పరీక్ష ఫీజు కట్టే సమయంలో ఫస్ట్ లాంగ్వేజ్ 'తెలుగు'కు బదులు 'హిందీ' అని అప్లికేషన్‌లో పొరపాటున పడటంతో పరీక్ష కేంద్రంలో అధికారులు ఆ విద్యార్థినికి 'హిందీ' పేపర్‌ను ఇచ్చారని చెప్పారు. పొరపాటు కారణంగా ఈ విధంగా జరిగిందని, ఈ విషయాన్ని పరీక్ష రాసిన అనంతరం పాఠశాల ప్రిన్సి పాల్‌కు తెలియజేశారని చెప్పారు. ఈ విష యాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ తమ దృష్టికి తీసుకు వచ్చారని అన్నారు. ఈ విషయం మీడియాకు కూడా తెలిసి కథనాలు రావ డంతో నష్టపోయిన విద్యార్థినికి న్యాయం చేయాలని ఉన్నతాధికారులు భావించి సోమవారం యథాప్రకారం ఆ విద్యార్థి నితో హిందీ పరీక్ష రాయించినట్లు చెప్పా రు. పరీక్షలు పూర్తయిన అనంతరం ఈ నెల 31వ తేదీన ఆ విద్యార్థినితో ప్రత్యే కంగా తెలుగు పరీక్షను రాయించ నున్నట్లు వివరించారు. విద్యార్థినికి న్యాయం చేయా లనే ఉద్దేశంతో పల్నాడు జిల్లా డిఇఒ వెంక టేశ్వరరావు, ఆర్జేడి, ఎస్ఎస్‌సి బోర్డు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఈ నిర్ణయంపై అధికారులకు విద్యార్థిని తల్లితండ్రులు ధన్యవాదాలు తెలి పారు. మీడియాకు, మండల విద్యాశాఖాధి కారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో, వాణిజ్య స్థలాల్లో

రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పల్నాడు

జిల్లా ప్రభుత్వ రంగ సంస్థల ప్రాం గణాల్లోన్ని వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించవద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారు లను ఆదేశించారు. మంగళవారం విజయ వాడలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుండి అన్ని జిల్లాల ఎన్ని కల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీ క్షించారు. ఈ సమీక్షలో నరసరావుపేట లోని కలెక్టర్ కార్యాల యంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుండి జిల్లా లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు పరిచినట్లు చెప్పారు.

విధుల నుండి వాలంటీర్ తొలగింపు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమలులో భాగం గా పలు దినపత్రికలలో ప్రచురితమైన ప్రతికూల వార్తలపై కలెక్టర్ ఎల్.శివ శంకర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గురజాల నియోజక వర్గంలో వాలంటీర్లు ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించిన ఘటనపై విచారణ అనం తరం వాలంటీర్ ఆవుల గోపాలకృష్ణను విధుల నుండి తొలగించినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన గురజాల నియోజకవర్గం తురకపాలెం గ్రామ సచివాలయ పంచాయతి కార్యదర్శి కె. రామరాజుకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అలాగే కారెంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామ రెవిన్యూ అధికారి పోలింగ్ కేంద్రం సంఖ్య: 253 బూతు స్థాయి అధికారిగా పనిచేస్తున్న వి.కోటేశ్వరరావు, ఒక రాజకీయ పార్టీకి సంబంధించి వీడి యో లింక్‌ను సామాజిక మాధ్యమాల ద్వారా సందేశాలు పంపడంతో వారికి షో కాజ్ నోటీస్ జారీ చేశారు.

ఫిర్యాదు చేసిన గంటలో పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-వినుకొండ

ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, అతి క్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వినుకొండ నియోజక వర్గం ఎన్నికల అధికారి సుబ్బారావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆర్వో సమావేశం నిర్వహించారు. సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఎన్నికల కోడ్ నిబంధనలో ఉల్లం ఘించిన , అధికార వినియోగం చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 08646 272000కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన గంటలో వారి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. బార్ అండ్ రెస్టారెంట్లు ప్రభుత్వం నిర్ణయించిన సమయం పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమా వేశంలో వినుకొండ మున్సిపల్ కమిషనర్ క్రిష్ణవేణి, వినుకొండ పట్టణ సిఐ సాంబ శివరావు, తహశీల్దార్ బ్రహ్మయ్య, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినుకొండ నియోజకవర్గం ఎన్నికల అధికారి సుబ్బారావు

సరైన అనుమతుల్లేకుండా పోస్టర్లు, బ్యానర్లు పెడితే కేసులు

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల కోడ్ అమలులో భాగంగా తొలగించిన రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు సరైన అనుమతులు లేకుండా తిరిగి ఏర్పాటు చేస్తే పోలీసు కేసులు నమోదు చేయాలని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అధికారులకు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్‌ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ స్థానిక నగరంపాలెం, కన్నావారితోట, రైలుపేట, నాజ్‌సెంటర్, కొత్తపేట, వసంతరాయపురం, శారదాకాలనీ, సంజీవయ్యనగర్, నెహ్రు నగర్‌లోని పలు ప్రాంతాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలును పరిశీలించారు. ఎన్నికల కోడ్ మేరకు నగరంలోని ప్రభుత్వ ఆస్తులపై ఉన్న వాల్‌రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలను, బహిరంగ ప్రదేశాలు, బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రైల్వే, రోడ్డు వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ సమావేశ ప్రదేశాల్లోని అన్ని రకాల రాజకీయపరమైన అడ్వర్టైజ్‌మెంట్లు, వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు అన్నింటినీ తొలగిస్తున్నట్లు చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో తొలగించిన వాటిని సరైన అనుమతి తీసుకోకుండా కొందరు తిరిగి ఏర్పాటు చేస్తున్నారని, అటువంటి వారిపై వెంటనే పోలీసు కేసులు నమోదు చేయాలని ఏఆర్‌ఓలను ఆదేశించారు. నగరంలో ఎక్కడైనా ఎంసిసి ఉల్లంఘనలను ప్రజలు గుర్తిస్తే జిఎంసి ప్రధాన కార్యాలయంలోని కంప్లైంట్ సెల్‌కు ఫోన్ చేసి చెప్పొచ్చని, లేదా వివరాలను 9849908391కు వాట్సాప్ ద్వారా పంపితే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యటనలో ఏఆర్‌ఓ సునీల్, ఎంసిసి టీం అధికారి అనుపమ, సిబ్బంది పాల్గొన్నారు.


ఎంసిసి అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి

పార్టీల ఫిర్యాదుల్ని సత్వరమే పరిష్కరించాలి

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాజకీయ పార్టీల నాయకుల నుండి అందిన ఫిర్యాదులు, అర్జీలను వెంటనే పరిష్కరించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఆర్‌ఓ కీర్తి చేకూరి చెప్పారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితాపై అందిన అర్జీల పరిష్కారంపై పశ్చిమ నియోజకవర్గ ఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాపై ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిదుల నుండి అందిన అర్జీలు, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను క్షేత్ర స్థాయిలో పటిష్టంగా అమలు చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. పార్టీ కార్యాలయాలు, అభ్యర్థుల కార్యాలయాల వద్ద ఎన్నికల సంఘం నిబంధనల మేరకే ప్రకటనల బోర్డులు, జెండాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నెల 11 నుండి 18 వరకు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఫారం 6, 7, 8లు, షిఫ్టింగ్ దరఖాస్తులు 3,529 అందాయని వాటిని రెండ్రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించామని చెప్పారు. సమావేశంలో ఏఈఆర్‌ఓలు వెంకట లక్ష్మీ, సునీల్, సూపరిండెంట్లు ప్రసాద్, పద్మ, సెక్టోరల్ అధికారి శ్రీధర్, వైసిపి నుండి డి.జానిబాబు, టిడిపి నుండి ఓంకార్, బీఎస్పీ నుండి సిహెచ్.వాసు, ఆప్ నుండి డాక్టర్ సేవాకుమార్, కాంగ్రెస్ నుండి జానీబాష, డిప్యూటీ తహసిల్దార్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిలో నీటికష్టాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. ముఖ్యంగా కొండ ప్రాంతాలపై నివశించే ప్రజలకు మంచినీరు అందడం గగనమైపోయింది. రెండు రోజుల నుంచి తాగునీరు కూడా సక్రమంగా అందడంలేదని నీటికష్టాలు మొదలయ్యాయని స్థానికులు వాపోతున్నారు. వేసవి కాలం ప్రారంభంలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. రోజులో గంట కూడా తాగునీరు సక్రమంగా అందడంలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నీరు సరఫరా అయ్యే మెయిన్ పాయింట్ వద్ద పదేపదే పైపులు పగిలిపోతున్నా పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. నాసిరకం పైపులు వాడటం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని చెబుతున్నారు. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో కొత్త పైపులైన్లు వేసినా సక్రమంగా మంచినీరు అందడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూతవేటు దూరంలో కృష్ణానది ఉన్నా తమకు ఈ నీటి కష్టాలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తాడేపల్లి పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరాకు ప్రణాళికలు తయారు చేయకుంటే రానున్న రోజుల్లో ప్రజలకు మరిన్ని నీటి కష్టాలు తప్పవని ఆందోళన వ్యక్తమవుతోంది.

నంబూరులో అంబటి మురళీకృష్ణ ప్రచారం

ప్రజాశక్తి తెనాలి

పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న అంబటి మురళీకృష్ణ మంగళవారం పెదకాకాని మండలం నంబూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన ఇంటింటికి తిరిగారు. వైసిపి గత ఐదేళ్లలో చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేసే వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారంలో ఎమ్మెల్యే ఆర్కే, మురళికృష్ణ

కెఎల్‌యులో జాతీయ స్థాయి ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో లలిత కళల విభాగం అధ్వర్యంలో జాతీయ స్థాయి చలనచిత్రోత్సవం మంగళవారం ప్రారంభమైంది. సినీఫిలియా అనే పేరుతో నిర్వహించిన కార్యక్రమాన్ని వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొదటి రోజును చలనచిత్ర కళాఖండాల శ్రేణిని ప్రదర్శించారు. లలిత కళల విభాగాధిపతి సుభాష్ యలవర్తి మాట్లాడుతూ చలనచిత్ర నిర్మాణ కళపై సంభాషణలను తమ వర్శిటీ ప్రోత్సహిస్తుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా యానిమేషన్ చిత్రం 'వాల్-ఇ'తోపాటు పలురకాల చలనచిత్రాలను ప్రదర్శించారు. ది గ్రేట్ వాల్ అనే చలన చిత్ర ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇది అద్భుతమైన విఎఫ్ ఎక్స్ తో ప్రసిద్ధి చెందిన దృశ్య కావ్యమని సుభాష్ యలవర్తి అన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ కల్పనల డీన్ డాక్టర్ ఎన్.బివి.ప్రసాద్ పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్ తదితరులు

కొండపోరంబోకు, రైల్వే స్థలాలకు పట్టాలిస్తాం : లోకేష్

ప్రజాశక్తి-తాడేపల్లి

వచ్చే ఎన్నికల్లో టిడిపి నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వస్తే తాడేపల్లి, ఉండవల్లి ప్రాంతాల్లోని ఇరిగేషన్, కొండ పోరంబోకు, అటవీ, రైల్వే, దేవదాయ భూముల్లో ఉంటున్న ఇళ్లస్థలాలను రెగ్యులరైజ్ చేసి ఇళ్ల పట్టాలిస్తామని టిడిపి మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి నారా లోకేష్ హామీనిచ్చారు. మంగళవారం తాడేపల్లి పట్టణంలోని ఎఆర్‌కాలనీ, ముగ్గురోడ్డు, కెఎల్ రావు కాలనీ ప్రాంతాల్లో జరిగిన రచ్చబండ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టాలిచ్చే విషయమై హామీ పత్రంపై సంతకం పెట్టి ఇస్తానని చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఈ విషయంపై కోర్టుకు వెళ్లి అడ్డుకుంటే చీపుర్లతో తిరగబడాలన్నారు. రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, కుళాయిల ద్వారా తాగునీటి సదుపాయం కల్పిస్తామని హామీనిచ్చారు. నియోజకవర్గంలో 20 వేల మంది పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పారు. కేంద్రంలో వచ్చేది ఎన్‌డిఎ ప్రభుత్వమన్నారు. కేంద్ర మంత్రులు అందరూ తమకు అండగా ఉంటారని చెప్పారు. అధికారంలో లేకపోయినా అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యు1 జోన్ పేరుతో 175 మంది రైతులను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



రాజారావుకు సత్కారం

ప్రజాశక్తి-తాడేపల్లి : వైసిపి జిల్లా ట్రేడ్ యూనియన్ కార్యదర్శిగా నియమితులైన మంగళగిరికి చెందిన బుల్లా రాజారావును మంగళవారం తాడేపల్లిలో వైసిపి నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాలసోమిరెడ్డి, ఎం.ప్రకాష్, కె.ఉదయరాజు, బి.భాస్కర్ పాల్గొన్నారు.



పోస్టాఫీసులో మేనిఫెస్టో పత్రాలు

ప్రజాశక్తి - మంగళగిరి

పోస్టు ద్వారా నేరుగా ప్రజలకు అందించేందుకు మేనిఫెస్టో ప్రతులను టిడిపి పోస్టు చేయగా అవి మంగళగిరి పోస్టల్ కార్యాలయంలో నిలిచాయి. మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇళ్లకు నేరుగా పంపే నిమిత్తం 1.80 లక్షల మేనిఫెస్టో కాపీలను టిడిపి కేంద్ర కార్యాలయం పోస్టు చేశారు. ఇందుకు గాను ఒక్కో కాపీకి రూ.2 చెల్లించినట్లు తెలిసింది. ఇవి 13 బస్తాల్లో స్థానిక పోస్టాఫీసుకు చేరగా ఈ విషయాన్ని స్థానిక అధికారులు జిల్లా పోస్టల్ నోడల్ అధికారికి తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాటిని పంచకూడదని జిల్లా అధికారి చెప్పడంతో వాటిని పోస్టాఫీసులోనే పక్కన పెట్టారు.



టిసిఎస్‌లో ఎఎస్ఎన్ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

దేశవ్యాప్తంగా టిసిఎస్ సంస్థ నిర్వహించిన నేషనల్ క్వాలిఫైడ్ టెస్ట్‌లో తెనాలి ఎఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అర్హత సాధించిన విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూలో హైదరాబాద్ టిసిఎస్ ఐటి సంస్థలో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందని ఎఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఈ మేరకు కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్మార్ట్ హైరింగ్ ప్రాసెస్ విధానం ద్వారా టిసిఎస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఎఎస్ఎన్ కళాశాల నుంచి 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. ప్రతి ఏటా 50-60 మంది తమ విద్యార్థులు టిసిఎస్‌కు ఎంపికవుతున్నారని తెలిపారు. విద్యార్థులతోపాటు వారిని తీర్చిదిద్దుతున్న అధ్యాపకులను శివకుమార్‌తోపాటు ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రాంచంద్ ప్రత్యేకంగా అభినందించారు.



ఓటరు నమోదుపై బీఎల్వోలకు అవగాహన

ప్రజాశక్తి-తెనాలి

పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో బిల్వోలు, సూపర్‌వైజర్లు, మెప్మా సిబ్బందికి ఓటరు నమోదుపై కమిషనర్ బి.శేషన్న మంగళశారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదుకు అర్హులేనన్నారు. వారిని ఓటర్లుగా నమోదు చేయించటంలో బిల్వోలు, సూపర్‌వైజర్లు చొరవ చూపాలన్నారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూలును ఎలక్షన్ కమిషన్ ప్రకటించిన నేపథ్యంలో నిర్ణీత గడువులోగా ఓటర్ల నమోదు పూర్తికావాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, అసిస్టెంట్ సిటీప్లానర్-1, 2 సుధాకర్, ఎల్.సుబ్బారావు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు సకాలంలో వేతనాలివ్వండి

- కేంద్రాలకు బడులకు ఒక్కపూట బడి విధానం ప్రకటించాలి
- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అంగన్వాడీలకు పెండింగ్లో ఉన్న వేతనాలు సకాలంలో చెల్లించి ఆదుకోవాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం సమస్యలు పరి ష్కరించాలని కోరుతూ పిడి కార్యా లయంలో సూపరింటెండెంట్ గోపాలరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లీశ్వరి మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లకు సమ్మె కాలంలో వేతనాలతో పాటు గత నెల వేతనం ఇప్పటివరకు జమ చేయలేదని మండిపడ్డారు. లక్షల రూపాయల వేతనాలు తీసుకునే వారికి సమయానికి వేతనాలు చెల్లించే ప్రభుత్వం అంగన్వాడీలపై వివక్ష చూపడం తగదన్నారు. ఇటీవల అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేసిన సమ్మె కాలానికి వేతనం చెల్లింపులకు హామీ ఇచ్చి అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో అంగన్వాడీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని అంగన్వాడీల్లో ఎక్కువగా ఒంటరి మహిళలు ఉన్నందున కుటుంబ పోషణ భారమవుతుందని ఆమె అన్నారు. కొన్ని మండలాలో కొత్తగా విధుల్లో చేరిన అంగన్వాడీలకు 4 నెలల వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జూన్ నెల వరకు అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, మిని వర్కర్లు సెంటర్లను మూసివేసి ఇంటికి వెళ్లే విధంగా అవకాశం కల్పించాలన్నారు. అంగన్వాడీ సెంటర్లకు వస్తున్న ప్రీస్కూల్ పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు కూడా ఎండల తీవ్రత వలన ఇబ్బందులు పడుతున్నారని ఈ నేపథ్యంలో అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కొన్ని చోట్ల వెయ్యి, వందల జనాభా ఉన్న చోట్ల కూడా మినీ సెంటర్లు నడుస్తున్నాయని, మినీ వర్కరు, హెల్పరు పని చేస్తున్నారని మినీ వర్కర్లకి పనిభారం పెరిగిందని ఎటువంటి సెలవులు ఇవ్వడంలేదన్నారు. వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, వేసవి సెలవులు మినీ వర్కర్లకి కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.



పిడి కార్యాలయంలో సూపరింటెండెంట్ గోపాల్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు



రొంపిచర్లలో పోలీస్ కవాతు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండల కేంద్ర మైన రొంపిచర్లలో మంగళ వారం పోలీసులు, సిఆర్పిఎఫ్ కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు .ఎస్ఐ కె.పి.ంవీంద్రబాబు మాట్లాడుతూ గ్రామం లోని అన్ని వీధులలో పోలీసులు, సిఆర్ పిఎఫ్ కేంద్ర బలగాలు కవాతు నిర్వహించినట్లు చెప్పారు.

సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక పోలీసు నిఘా విభాగం ఏర్పాటు చేశామని, దీని ప్రకారం ప్రతి రోజు రాత్రి 10 గంటల్లోపు అన్ని షాపులు మూసి వేయాలని, రాత్రి 10 గంటల తరువాత అన వసరంగా బయట తిరిగినా, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిం చేందుకు ప్రజలు తమకు సహకరించాలని చెప్పారు. ఎన్నికలలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆర్టీసీ బస్టాండ్ వద్ద బ్యానర్ తొలగించిన చిత్రం

హోర్డింగులు తొలగించిన అధికారులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ప్రజాశక్తిలో ప్రచురితమైన'హోర్డింగులుపై రాజకీయ పార్టీల బొమ్మలు.. పట్టించుకోని అధికారులు' వార్తకు మున్సిపల్ అధికారులు స్పం దించారు. హోర్డింగులను అధికారులు తొలగించారు. ఆర్టీసీ బస్టాండ్ ముఖ ద్వారం పై రాజకీయ పార్టీల నాయకుల బొమ్మలతో ప్రైవేటు ఆసుపత్రి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించారు. గోడలకు అంటించిన రాజకీయ పార్టీల నాయకుల పోస్టర్లను తొలగించారు.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి - బెల్లంకొండ



మండల కేంద్రమైన బెల్లంకొండకు చెందిన పలువురు టిడిపిని వీడి వైసిపిలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని చెప్పారు.

ప్రజాశక్తి-విజయపురిసౌత్



మాచర్ల మండలం లోని ద్వారాకాపురి గ్రామానికి చెందిన 15 వైసిపి కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం మాచర్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. అనంతరం జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ టిడిపికి వస్తున్న ఆదరణ చూసి వైసిపి నుంచి పెద్ద ఎత్తున తమ పార్టీలోకి వస్తున్నట్లు చెప్పారు.

టిడిపి జాతీయ కమిటీ సభ్యుడు

నాగేశ్వరరావు మృతి తీరని లోటు: టిడిపి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుంటుపల్లి నాగేశ్వరరావు (62) మృతి పార్టీకి తీరని లోటని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు జీవి ఆంజనేయులు అన్నారు. తెలుగుదేశం జాతీయ కమిటీ సభ్యుడు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల అస్వస్థతకు గురైన ఆయన, నరసరావుపేటలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. నరస రావుపేటలోని జిల్లా టిడిపి కార్యాలయంలో ఆంజనేయులు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్గా, పార్టీ లో సీనియర్ నాయ కుడిగా, ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు పదవుల ద్వారా పార్టీకి ఎనలేని సేవలు అందించారని అన్నారు. ప్రస్తుతం పార్టీ క్రమ శిక్షణా సంఘం జాతీయ సభ్యులుగా పని చేస్తున్నట్లు చెప్పారు. నాగేశ్వరరావు కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు.

ప్రజాశక్తి - దాచేపల్లి

గుంటుపల్లి నాగేశ్వరరావు మృతికి పలువురు సంతాపం తెలిపారు. దాచేపల్లికి చెందిన ఆయన టిడిపి ఆవిర్భా వం నుంచి ఆ పార్టీలో క్రియాశీలకంగా పని చేసి గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగారు. నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ఛైర్మన్గా మూడుసార్లు పనిచేశారు ఎమ్మెల్సీ కావాలని బలంగా కోరుకునే వారు.

టిడిపి నేతల సంతాపం

ప్రజాశక్తి - మంగళగిరి

నాగేశ్వరరావు మృతిపై టిడిపి నేతలు సంతాపం తెలిపారు. స్థానిక టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఆవిర్భావం నుండి తుది శ్వాస విడిచే వరకు పార్టీ కోసం పనిచేశారని, అదే సమయంలో బీసీ వర్గాల్లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని శాసనమండలి మాజీ సభ్యులు టి.డి.జనార్ధన్, శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎం.ఎ. షరీఫ్ అన్నారు. కార్యక్రమంలో టిడిపి మీడియో కోఆర్డినేటర్ డి.నరేంద్ర, వడ్డెర సాధికార సమితి నాయకులు ఈశ్వర్, అధికార ప్రతినిధి పాతర్ల రమేష్, హెచ్ఆర్డీ సభ్యులు ఎస్పీ సాహెబ్, ఆహ్వాన కమిటీ సభ్యుడు హసన్ బాషా, మైనార్టీ సాధికార సమితి కన్వీనర్ బేగ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంతాపం తెలిపారు. అదేవిధంగా మంగళగిరి పట్టణ నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్వాహకులు మున్నంగి చలపతిరావు సంతాపం తెలిపారు.



ఇంటింటికీ టిడిపి మేనిఫెస్టో

ప్రజాశక్తి-వినుకొండ

టీడీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు సంక్షేమం సాధ్యమని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తనయుడు, యువ నాయకుడు గోనుగుంట్ల హరీష్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 11వ వార్డు రైలు పేటలో టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు ఆయూబ్ ఖాన్ అధ్యక్షతన ఇంటింటి ప్రచారం నిర్వహించగా హరీష్ పాల్గొన్నారు. సూపర్ సిక్స్ మ్యానిఫెస్టో క్యాలెండర్ను ఇంటింటికి తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మళ్లీ సిఎం అయితేనే ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని, మెరుగైన పారిశ్రామిక అభివృద్ధి చెంది రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో ఉంటుందని అన్నారు.

ఫలితం ఆశించని సహాయమే సేవ



మాట్లాడుతున్న ఎఎన్‌యు వీసీ రాజశేఖర్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

లాభాపేక్ష లేకుండా ఎదుటివారికి సహాయం చేయడమే నిజమైన సేవ అని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ పి.రాజశేఖర్ అన్నారు. వర్సిటీలోని ఎన్‌ఎస్‌ఎస్ విభాగం మంగళవారం రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించింది. 'స్పార్క్ అండ్ చేంజ్ హౌ ఎన్ ఎస్ ఎస్ యు టు సర్వ్ టు లీడ్' అంశంపై జరిగిన సదస్సుకు వీసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా గుణాన్ని పెంపొందించి తద్వారా పరివర్తన తేవడానికి ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడుతాయని అన్నారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వర్సిటీని ప్లాస్టిక్ రహిత విశ్వవిద్యాలయంగా మార్చాలని ఆదేశించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ పి.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి విద్యార్థుల ద్వారా అవగాహన సదస్సు నిర్వహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, కాలానుగుణంగా వచ్చే రోగాలకు నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రెక్టార్ పి.వరప్రసాద్ మూర్తి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు సామాజిక సైనికులని, సామాజిక మార్పుకు వెన్నెముక లాంటి వారని అన్నారు. రిజిస్ట్రార్ బి.కరుణ మాట్లాడుతూ మంచి ఆలోచనలే మంచి సమాజాన్ని నిర్మిస్తాయని తెలిపారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన సెమినార్ కన్వీనర్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ సేవల ద్వారా విద్యార్థులలో మానసిక పరిపక్వత పెంపొందించి సమాజాభివృద్ధికి దిక్సూచిలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సిపిఆర్ బెస్ట్ డే లైఫ్ స్కిల్స్‌పై వివరించారు. కార్యక్రమంలో ఆంధ్ర యూనివర్సిటీ బీసీడీఈ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్ఎడి పాల్, సిడిసి డిన్ కె.మధుబాబు, ఓఎస్‌డి కె.సునీత, సిఎస్ఆర్ కోఆర్డినేటర్ సరస్వతి రాజు అయ్యర్, ఐక్యూ ఏసీ డైరెక్టర్ సంధ్య కోలే, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి 200 మంది ప్రోగ్రాం అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ వేలం వాయిదా

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో మంగళవారం నిర్వహించాల్సిన మున్సిపల్ కూరగాయల మార్కెట్ ఆసీలు వేలాన్ని 26వ తేదీకి వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్ఎంఇ నయీమ్ అహ్మద్ మంగళవారం తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనేందుకు ఎవరు దరఖాస్తుదారులు దరఖాస్తు చేసు కొనకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.


మైనార్టీ నాయకులతో సమావేశమైన మురుగుడు లావణ్య

నా విజయానికి సహకరించండి : లావణ్య

ప్రజాశక్తి - మంగళగిరి

తన విజయానికి సహకరించాలని వైసిపి మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య కోరారు. అంజుమన్ సంస్థ మాజీ కార్యదర్శి ముస్లిమ్ యువసేన కన్వీనర్ షేక్ ఇస్మాయిల్‌ను ఆమె మంగళవారం కలిశారు. రానున్న ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని కోరారు. ముస్లిమ్ మైనార్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. ఆమెవెంట మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, నాయకుల కొల్లి వాసు ఉన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మల్లెబోయిన తేజ

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలోని కె.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ కాంట్రగడ్డ విజయ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా పిబిఎన్ కాలేజీ రోడ్డులోని కెవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆఫీస్ వద్ద కృష్ణవేణి వాటర్ ప్లాంట్ కుమారుడు మల్లెబోయిన తేజ మంగళవారం ప్రారంభించారు. మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు దాహార్తిని తీర్చడానికి ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాస్టర్ శ్యాం ప్రసాద్, గుడివాడ పవన్, చిలకపాటి సింహాద్రి, పద్మ, వాసు, కొండయ్య, వెంకటరావు, పీటర్, విజయ్, కుమార్ పాల్గొన్నారు.

ప్రచార ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - తాడికొండ



సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గంగరాజు కోరారు. మంగళవారం తాడికొండ ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించగా ఎంపిడిఒ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులందరూ ప్రచారానికి ర్యాలీకి తప్పనిసరిగా అనుమతులు పొందాలని చెప్పారు. సువిధ ఆప్ నందు తగిన వివరాలు నమోదు చేసి అనుమతులు పొందాలని, లేకుంటే కార్యాలయంలో సంప్రదించి తగిన ఆధారాలు సమర్పించి లిఖితపూర్వకంగా కూడా అనుమతులు పొందవచ్చని అన్నారు. నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వాటిపైన ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. సమావేశంలో డీఎస్పీ అజయ్ కుమార్ గౌడ్, నాలుగు మండలాల తహశీల్దార్లు, సిఐటియు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో సోషల్ వర్కర్ల పాత్ర కీలకం

ప్రజాశక్తి - ఎఎన్‌యు



సమాజాభివృద్ధికి సోషల్ వర్కర్ల కృషి ఎంతో అవసరమని సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు అన్నారు. వర్సిటీలోని సోషియాలజీ విభాగంలో మంగళవారం వరల్డ్ సోషల్ వర్క్ దినోత్సవం నిర్వహించగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సోషల్ వర్కర్లు అనేక సామాజిక సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని, సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ త్రిమూర్తిరావు మాట్లాడుతూ సోషల్ వర్కర్లు సమాజాన్ని నిత్య నూతనంగా నిర్మించే వారని అన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో సామాజిక మార్పు అనివార్యమని, ఆ మార్పును ఆచరణాత్మకమైన అభివృద్ధికిలోకి తీసుకురావడానికి సోషల్ వర్కర్లు కృషి చేస్తున్నారని అన్నారు. మరొక అధ్యాపకులు డాక్టర్ రాజకుమార్ మాట్లాడితూ సోషల్ వర్క్ అకడమిక్ పరంగా ఉన్నత విలువలు కలిగి ఉందని, సమాజంలో నశించిపోతున్న అనేక మానవ సంబంధాలను తిరిగి నిర్మించడంలో సోషల్ వర్కర్ల పాత్ర ఉందని చెప్పారు. కార్యక్రమంలో పరిశోధకులు ఆవులయ్య, స్వరూప్ పాల్, బ్రహ్మం పాల్గొన్నారు.

వర్సిటీని సందర్శించిన కేంద్ర ప్రభుత్వ సీనియర్ అడ్వకేట్

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని న్యాయ శాస్త్ర విభాగాని సెంట్రల్ గవర్నమెంట్ సీనియర్ ప్యానల్ అడ్వకేట్ బండారు శేష తల్పసాయి మంగళవారం సందర్శించారు. సుప్రీంకోర్టులో జరిగే ప్రాక్టీస్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇదే విభాగంలో శేష తల్ప సాయి వర్సిటీలో మాస్టర్ ఆఫ్ లా కోర్సు చదివే రోజుల్లో గోల్డ్ మెడల్ సాధించారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల ప్యానల్ అడ్వకేట్‌గా సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ కొనసాగించారు. ఆయన్ను విభాగం అధ్యాపకులు డాక్టర్ నూతక్కి సతీష్, డాక్టర్ వెంకటరమణ, ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ ఎంవి రమణ సన్మానించారు.

నాదెండ్ల బ్రహ్మయ్యకు ఘన నివాళులు

ప్రజాశక్తి - మంగళగిరి : దోపిడీ వ్యవస్థ మార్పు కోసం నాదెండ్ల బ్రహ్మయ్య కృషి చేశారని ఇఫ్టా జాతీయ నాయకులు ప్రసాద్ అన్నారు. స్థానిక పెన్షనర్స్ హాలులో బ్రహ్మయ్య సంస్మరణ సభ మంగళవారం నిర్వహించారు. సభకు రేఖాకృష్ణార్జునరావు అధ్యక్ష వహించగా చిత్రపటా నికి సామాజికవేత్త మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా పనిచేసిన బ్రహ్మయ్య తను నమ్మిన రాజకీయ విశ్వాసాల కొరకు అంకితమైన పని చేశారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కె.కాశయ్య, ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.రవి, న్యాయవాది పి.నవజీవన్, శ్రీలక్ష్మీనరసింహ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఎం.మోహన్‌రావు, సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, ఎఐటియుసి నాయకులు ఎ.ప్రభాకర్, కె.సుబ్బారావు, కవి డెన్నిస్‌రాయ్, నల్గొండ జిల్లా కమ్యూనిస్టు నాయకులు శీలం స్వామి పాల్గొన్నారు.

విడగొట్టి పాలించే పార్టీలకు గుణపాఠం చెప్పాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - మంగళగిరి



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి మట్టి, నీళ్ల ఇచ్చిన బిజెపితో టిడిపి, జనసేన పొత్తు పెట్టుకున్నాయని, నరేంద్ర మోడీని ప్రజాగళం సభకు పిలిచి రాష్ట్ర పరువు తీశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కంతేటి జీవన్ సాగర్ విమర్శించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే స్వార్ధ ప్రయోజనాలకే టిడిపి, జనసేన, వైసిపిలు ప్రాధాన్యమిస్తున్నాయని అన్నారు. బిజెపితో టిడిపి, జనసేన అధికారికంగా పొత్తుపెట్టుకోగా వైసిపి లోపాయికార రాజకీయం చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలైన భూసేకరణ చట్టం, వ్యవసాయ నల్ల చట్టాలు, పెరిగిన నిత్యవసర ధరలు, పెట్రోలు, డీజిల్ ధరలు, పౌరసత్వ సవరణ చట్టం వంటివేమీ ఈ పార్టీలకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై రాహుల్ గాంధీ పోరాడుతున్నారని, దేశమంతా ఒక్కటే అని మణిపూర్ ఘటనల సందర్భంలో రాహుల్‌గాంధీ ఉద్ఘాటించారని చెప్పారు. విడగొట్టి పాలించే పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించి గుణపాఠం చెప్పాలన్నారు.



పలు ప్రాంతాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రానున్న ఎన్నికల్లో తీసుకోల్సిన జాగ్రత్తలపై తెనాలి టూ టౌన్ పోలీసులు కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ముందుగానే చేరుకున్న సాయుధ దళాలతో పట్టణంలోని లింగారావు సెంటర్, ఐతానగర్, రజక చెరువు, గాంధీచౌక్, ప్రకాష్ నగర్ మీదుగా బస్టాండ్ వరకూ కవాతు సాగింది. ఎన్నికల ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని సిఐ ఎ సుధాకర్ కోరారు. శాంతిభద్రతలు విఘాతానికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై డి.బాబూరావు, హెడ్ కానిస్టేబుల్ బాషా పాల్గొన్నారు.

నేడు అవగాహన హాస్యవల్లరి

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ప్రతినెలా నిర్వహిస్తున్న హాస్యవల్లరి-నవ్వు-నవ్వించు కార్యక్రమం బుధవారం సాయంత్రం 6 గంటలకు అరండల్‌పేట 15/1లోని సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జోక్స్, కామెడీస్కిట్స్, హాస్య, వ్యంగ్య పాటలు, కవితలు, పేరడీలు, మ్యాజిక్, మిమిక్రీ తదితరాలతో హాజరైన వారందరినీ ఆనందింపజేస్తారని తెలిపారు. ప్రముఖ మెజిషియన్ ఆర్.ఎల్.ప్రసాద్, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు ఆర్.పి.ఎల్ నరసింహారావు, ప్రముఖ నాటక రచయిత పి.వి.రామ్ కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విద్యుత్ లైన్లు మరమ్మతులు కారణంగా తెనాలి పట్టణంలోని చెంచుపేట అమరావతి ఫ్లాట్స్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎపిసిపిడిసిఎల్, ఆపరేషన్ సబ్ డివిజన్ తెనాలి టౌన్ డిఇఇ బి.అశోక్ కుమార్ మంగళ వారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరా యం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.



కళ్లకు గంతలతో మోకాళ్లపై నిరసన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

జీతం బకాయిల కోసం మండల కేంద్రమైన ఫిరంగిపురంలో పంచాయతీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరింది. మంగళవారం సమ్మె శిబిరంలో కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిరసన తెలిపారు. తమకు రావాల్సిన 9 నెలల జీతాలను, హరిత రాయబారులకు పెండింగ్ జీతాలను ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా సమ్మె శిబిరంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, కేరళ మాజీ సిఎం, సిపిఎం అగ్రనేతల్లో ఒకరైన ఇఎంఎస్ నంబూద్రిపాద్, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి సభలు నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. సిహెచ్ రామారావు అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం అతి చిన్న వయస్సులోనే తుపాకి పట్టి తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేగా మహిళల, రైతుల, కార్మికుల, కర్షకుల సమస్యలను అసెంబ్లీలో వినిపించారని, అనేక అభివృద్ధి కార్యక్రమాలనూ చేశారని తెలిపారు. తుదిశ్వాస వరకూ ప్రజల కోసమే పరితపించారని అన్నారు. ఇఎంఎస్ నంబూద్రిపాద్ దాదాపు ఏడు దశాబ్దాల పాటు ప్రజా జీవితం గడిపారని, శ్రామిక ఉద్యమాల్లో చెరగని ముద్ర వేశారని గుర్తు చేశారు. 1931లో కాలేజీ చదువును మానేసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని, జైలు శిక్షనూ అనుభవించారని తెలిపారు. 1936 కేరళలో కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక బృందంలో ఆయన ఒకరన్నారు. ఆయన రచనలను అధ్యయనం చేయాలని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు ప్రభుదాస్, బాలస్వామి, సతీష్, ఓర్సు బాలయ్య, శ్రావణ్, సునీత, ఏసమ్మ, వెంకటేశ్వరమ్మ, సిఐటియు మండల కార్యదర్శి ఇబ్రహీం, అనోక్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

సైడ్ ఎఫెక్ట్స్ లేని చికిత్స ఫిజియోథెరపి

ప్రజాశక్తి-గుంటూరు

ఫిజియోథెరపి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఒక శారీరక చికిత్స అని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వి.సుజాత అన్నారు. మంగళవారం అవగాహన ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ సుజాత మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా కుంగిపోయే రోగుల వికాసానికి ఫిజియోథెరపి స్వాంతన చేకూరుస్తుందన్నారు. మారుతున్న శాస్త్ర పరిజ్ఞానంతో సైన్స్ నిత్యం కొత్తపోకడలతో అసాధ్యాన్ని సుసాధ్యం చేసే క్రమంలో ఫిజియోథెరపి వైద్యశాస్త్రంలో ఉపవిభాగంగా ఆవిర్భవించిందన్నారు. ఏదైనా అనారోగ్యంగానీ, గాయం తర్వాత శరీరం తిరిగి మామూలుగా అయి, రోగి తన విధులను సక్రమంగా చేస్తుందన్నారు. వివిధ శస్త్ర చికిత్సల అనంతరం రోగుల జీవన విధానం మెరుగు



పర్చటంలో ఫిజియోథెరపి ముఖ్యపాత్ర వహిస్తుందని, ఫిజియోథెరపిలో రోగిలో మునుపటి ఉత్సాహంతోపాటు స్వీయ విశ్వాసాన్ని అందిస్తుందని వివరించారు. నాడీ వ్యవస్థలోపాలు, కండరాల లోపాలు, శ్వాసకోశ రుగ్మతలకు ఫిజియోథెరపి బాగా పనిచేస్తుందన్నారు. అనంతరం డాక్టర్ సుజాతను అవగాహన సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సదాశివం, అంజిరెడ్డి, శివశంకరరావు, కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో రాజకీయ ప్రకటనలకు అనుమతి వద్దు

గుంటూరు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ప్రాంగణాల్లోని వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లను, బ్యానర్లను అనుమతించవద్దని ఎన్నికల రిటర్నింగ్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ట అమలుపై కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రిటర్నింగ్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం అదేశాల మేరకు రాజకీయపార్టీల ప్రచార పోస్టర్ల ప్రదర్శనకు ప్రస్తుతం హైవేలు, మెయిన్ రోడ్ల ప్రక్కనున్న హోర్డింగ్‌లను సమాన ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రిటర్నింగ్ అధికారులు వారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

పరిధిలోని మున్సిపల్ కమిషనర్లు, పంచాయతి అధికారులకు వీటిపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున కొత్త అనుమతులు ఇవ్వద్దని సూచించారు. ప్రైవేటు భవనాలపై వాల్‌రైటింగ్స్‌ను అనుమతించవద్దని, బ్యానర్లు, జెండాలకు అనుమతి తీసుకున్న తరువాత మాత్రమే ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సి విజల్, వార్త పత్రికల్లో వచ్చిన ఫిర్యాదును సకాలంలో పరిష్కరించాలని, తనిఖీలు నిర్వహించిన నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సీజ్‌చేసిన వాటి వివరాలు ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టంలో నమోదు చేయాలని చెప్పారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ఈవీఎంల ర్యాండమైజేషన్, పోలింగ్ సిబ్బందికి శిక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ జి.రాజకుమారి, గుంటూరు తూర్పు నియోజకవర్గం ఆర్వో కీర్తి చేకూరి, తెనాలి నియోజకవర్గం ఆర్‌ఓ ప్రఖార్ జైన్, డిఆర్‌ఓ పి.రోజా పాల్గొన్నారు.



సుందరయ్య నగర్‌లో మల్లు స్వరాజ్యం వర్ధంతి

ప్రజాశక్తి-గుంటూరు

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం 2వ వర్ధంతి సభ మంగళవారం స్థానిక 41వ డివిజన్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో స్థానిక శాఖ కార్యదర్శి షేక్.ఖాసిం షహీద్ అధ్యక్షతన నిర్వహించారు. ఐద్వా, సిఐటియు, కెవిపిఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం చిన్న వయసులోనే పేదల కోసం, కూలిరేట్ల పెంపు కోసం సొంత మనుషులతోనే పోరాడి రజాకార్లకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం నడిపిన వీర వనిత అని, చట్టసభల్లో మహిళా సమస్యల మీద తన గళాన్ని వినిపించారన్నారు. సిఐటియు నాయకులు ఆది నికల్సన్ మాట్లాడుతూ పేదల కోసం నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తుపాకి పట్టి సాయుధ పోరాటం చేసిన మొదటి వీరవనిత అని, తుది శ్వాస విడిచే వరకు ప్రజా పోరాటాలలోనే మమేకమయ్యారని, ఆమె జీవితం మహిళలందరికీ ఆదర్శమని చెప్పారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు జి.లూథర్‌పాల్, వివిధ సంఘాల నాయకులు ఎం.అచ్యుత కుమారి, ఆదిలక్ష్మి, కె.పద్మ, ఎస్.పద్మనాభుడు, ఆదిబాబు పాల్గొన్నారు.

మోకీలు మార్పిడికి అధిక బరువు అడ్డుకాదు

క్లిష్టతరమైన ఆపరేషన్లకు రోబోటిక్ తో పరిష్కారం - సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి



అత్యంత క్లిష్టతరమైన మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలకు రోబోటిక్‌తో చక్కటి పరిష్కారం లభిస్తుందని, నూరుశాతం ఫలితాలు రాబట్టవచ్చని సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, సాయిభాస్కర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అన్నారు. కృష్ణాజిల్లా గంపలగూడేనికి చెందిన 150 కిలోలకు పైబడి బరువున్న కె.మురళికృష్ణకు రోబోటిక్ ద్వారా మోకీలు మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ విషయమై మంగళవారం అరండల్‌పేటలోని తన హాస్పిటల్‌లో వివరాలను విలేకర్లకు వెల్లడించారు. అధిక ఊబకాయంతో బాధపడుతున్న వారిలో గుండెపై ఏ విధమైన ప్రభావం పడుతుందో మోకిళ్లపై కూడా అదేవిధమైన భారం పడి చిన్న వయసులోనే అరిగిపోయి నడవలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. 52 ఏళ్ల వయసులోనే అధిక ఊబకాయం కారణంగా మురళీకృష్ణకు రెండు మోకిళ్లు పూర్తిగా అరిగిపోయాయని, కుడి మోకీలు తన గతిని మార్చుకుని వెలుపలకు వచ్చేయడంతో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇటువంటి క్లిష్టతర పరిస్థితుల్లో మామూలు సర్జరీతో పోల్చితే రోబోటిక్ ద్వారా కచ్చితత్వంతో కూడిన ఫలితాలు వస్తాయన్న ఉద్దేశంతో ఓ సీనియర్ సర్జన్‌గా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇది అధిక ఊబకాయం కలిగిన మురళీకృష్ణ విషయంలో మరోమారు రుజువైందని చెప్పారు. వైద్య రంగంలో వస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు అందించడంలో ఎల్లప్పుడూ ముందు ఉంటామని తెలిపారు. ఇప్పటికే 300కు పైగా పూర్తిస్థాయి ఆటోమేటిక్ రోబోటిక్ సర్జరీలు నిర్వహించి రోగులకు సంతోషకరమైన ఫలితాలను అందించగలిగామని డాక్టర్ నరేంద్రరెడ్డి అన్నారు. ఆపరేషన్ చేయించుకున్న మురళీకృష్ణ మాట్లాడుతూ తనకు మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స వల్ల ఉపయోగం ఉండదని డాక్టర్లు సూచించారాని చెప్పారు. నరేంద్రరెడ్డిని సంప్రదించగా నడిపించే బాధ్యత తనదని హామీ ఇచ్చారని అన్నారు.

డిఎంహెచ్‌ఒకు ఆశా వర్కర్ల వినతి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏ.పి.ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లు పని చేయని సందర్భంలో వెంటనే మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, సబ్ సెంటర్లు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్‌లో డ్యూటీలు చేయించడం నిలుపుదల చేయాలని, ఆశా వర్కర్లు నిర్వహించాల్సిన రికార్డులు ప్రభుత్వం నుండి ఇచ్చే ఏర్పాటు చేస్తామని రాష్ట్ర అధికారులు ఇచ్చిన మాట ప్రకారం రికార్డులు ఇవ్వాలని, ఈలోగా నోట్ బుక్స్‌లో రిపోర్ట్ రాసే ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరారు. డిఎంహెచ్‌ఒ స్పందిస్తూ ఆశా వర్కర్లు సబ్ సెంటర్లు వెల్‌నెస్ సెంటర్లలో డ్యూటీ చేయాల్సిన అవసరం లేదని, ఇతర సమస్యలు



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ, అధ్యక్షులు కె.లక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ధనలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ధనలక్ష్మి పాల్గొన్నారు.

డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి మంగళవారం డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఉద్యోగ సంఘాల నేతలు, వేతన సంబంధిత సమస్యలపై సుమారు 70 అర్జీలు అందించినట్లు అధికారులు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి అర్జీలను కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు పంపిస్తామని డిఎంహెచ్‌ఒ తెలిపారు.



ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ వినతి

ఎపిఎన్‌జిఒ నాయకులు కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందచేశారు. ఎఎన్‌ఎంలకు యూనిఫామ్ అలవెన్స్, ఎఫ్‌టిఎ, ఆర్‌సిహెచ్ డేటా అప్‌లోడ్ చేసిన సందర్భంలో చెల్లించాల్సిన అలవెన్స్, 104, 108, ఎన్‌హెచ్‌ఎంలలో పనిచేస్తున్న సిబ్బంది జీతాలు, ఎంఎన్‌ఒ, ఎఫ్‌ఎన్‌ఒలో పనిచేస్తున్న సిబ్బంది 10 నెలల జీతాల బకాయిలు, సచివాలయాల్లో పనిచేస్తున్న ఎఎన్‌ఎం గ్రేడ్-3, గ్రేడ్-2లకు ప్రమోషన్లు ఇవ్వాలని, ఎఎన్‌ఎంలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి జిఒ 167 ద్వారా పూర్తి జీతం చెల్లింపు తదితర సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, ఎస్.సతీష్‌కుమార్, నాయకులు ఎ.శ్యాంసుందర్ శ్రీనివాస్, కె.శ్రీనివాసరావు, చింతల కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.